www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 10 అక్టోబర్ 2024

సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు 'ఆదిత్య' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జెఎన్‌టియు ఎ సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కె.తేజవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యాడు. ఈనెల 7న గూడురులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని సౌత్ జోన్ జట్టులో స్థానం సంపాదించాడు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు రావాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్. ఆర్. రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎన్. నాగమల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, ఇసిఇ హెచ్‌ఒడి వెంకట వరప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు సురేంద్రబాబు, మోసెస్ ప్రవీణ్, వివిధ విభాగాధి పతులు, అధ్యాపకులు, సహచర విద్యార్థులు తేజవర్ధన్‌రెడ్డిని అభినందించారు.

సౌత్‌జోన్ క్రికెట్‌కు ఎంపికైన తేజవర్ధన్‌రెడ్డి

'ముదివేడు' నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వాసితులతో కలసి ముదివేడు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ముదివేడు రిజర్వాయర్ నిర్మించాలని తలపెట్టి అనేక అవకతవకలకు పాల్పడి రైతులను ముంచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం పోరాటం ఫలితంగా ముంపుకు గురయ్యే భూములను, ఇళ్లను గుర్తించడం కోసం ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి, అవార్డు కూడా ప్రకటించిందని గుర్తుచేశారు. దాదాపు 780ఎకరాల భూములకు రూ.108 కోట్లు నష్టపరిహారం చెల్లించాలని ప్రకటించినా అమలుకు నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలోని ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోతున్నాయని ఒక్క రూపాయి నష్టపరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల్లో మట్టిని తవ్వేసిన కారణంగా వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయాని, రిజర్వాయర్ నిర్మాణ సంస్థ రైతులకు లీజు చెల్లిస్తామని చెప్పి మోసం చేసిందని అన్నారు. భూములు, ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి 5 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. డికెటి భూములకు పరిహారం ఇవ్వాలని, భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.5 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితుల సంఘం నాయకులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ముక్దుమ్ బాషా, ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మాధవరెడ్డి, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

నిర్వాసితులతో కలిసి ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

అద్దె బిల్లులు చెల్లించకుంటే ఆందోళనలు : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో క్యాబ్‌లకు ఇవ్వాల్సిన రూ.30 లక్షల అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అద్దె కిచ్చిన క్యాబ్ డ్రైవర్ల ముఖ్యులతో కలసి అద్దె బిల్లులు త్వరగా ఇవ్వాలని పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అదేశాల మేరకు మదనపల్లి, తంబళ్లపల్లి అసెంబ్లీల నియోజకవర్గాలలో 37 వాహనాలు, ఏడు కాన్వాయ్ వాహనాలు రెండు నెలలు ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్‌ను వేరే అవసరాలకు వాడుకొని అద్దెకొచ్చిన క్యాబ్ డ్రైవర్లకు మాత్రం మొండిచేయి చూపడం ఏంటని ప్రశ్నించారు. రెండు నెలల అద్దెబకాయి రాకపోవడంతో క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని పేర్కొన్నారు. అప్పులు తీవ్ర మాయ్యాయని, అదిగో, ఇదిగో అంటూ నాలుగు నెలలలుగా ఆఫీస్ చుట్టూ తిప్పుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బిల్లులు చెల్లించకపోతే జిల్లా వ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర, క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలకు మంగళం : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కూటమి ప్రభుత్వపాలనలో ప్రభుత్వాస్పత్రులలో కంటి పరీక్షలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని, కొనసాగించాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పేదల జీవితాలలో వెలుగులు నింపే కంటి వైద్యాన్ని రద్దు చేసేందుకు ఈ ప్రభుత్వం వెనుకాడలేదని, సిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రుల్లో నేత్ర పరీక్షల కేంద్రాలు (ముఖ్యమంత్రి ఐఐ సెంటర్) సేవలను నిలిపివేయడం దుర్మార్గమన్నారు. కంటి వైద్యం అందిస్తున్న ఐఐ కేంద్రాల గడువు ముగిసినా రెన్యువల్ చేయకుండా వాటిని నిర్వీర్యం చేసేందుకు ఒడిగట్టిందన్నారు. అత్యాధునిక యంత్రాలతో నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా కళ్ళజోళ్ళు అందించాల్సిన ఈ కేంద్రాలు గత నెల 14 నుంచి మూతబడడంతో కంటి సమస్యలుతో బాధపడుచున్న పేదలు ప్రయివేట్‌గా వైద్యం చేయించుకుంటుండడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఐఐ కేంద్రాల సేవలు, కంటి అద్దాల పంపిణీ ప్రక్రియ ఆగిపోవడంపై సంబంధిత వైద్యాధికారులను అడుగుతుంటే నేత్ర పరీక్షలకు సంబంధించి ప్రయవేట్ కంపెనీతో ఒప్పంద గడువు ముగిసిందని, ఆ సంస్థ మిషన్లతో పాటు కంప్యూటర్‌ను కూడా తీసుకెళ్లారని చెపుతున్నారన్నారు. సర్వేంద్రియానాం నయనం ప్రదానం పెద్దలు అన్నారన్నారు. చూపు కొద్దిగా మందగించినా జీవనం కష్టమై బతుకు భారంగా మారుతుందన్నారు. పేదల వైద్యానికి పెద్దపీట వేసిన గత జగన్ ప్రభుత్వం కంటి వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సిఎంఐఐ కేంద్రాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాంకేతికను జోడించి అత్యాధునిక యంత్రాలతో పేదలకు మరింత ఉపయోగ పడేలా జీవం పోసి నడిపించారన్నారు. ఆయా ఆసుపత్రులకు వచ్చే రోగులే కాక, నియోజక వర్గంలోని ప్రతి పాఠశాలలోనూ కంటి శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు కంటి పరీక్షలు చేసేవారన్నారు. గత ఏడాది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి శిబిరాలతో వేల మందికి పరీక్షలు చేసి, కళ్ళద్దాలను పంపిణీ చేశారన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు మూతబడటంతో పేదలు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. పేదలకు ఎంతో ఉపయోగకంగా ఉన్న ఉచిత కంటి వైద్య పరీక్షల నిర్వహణకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

మూఢ నమ్మకాల ముసుగులో మట్టుబెట్టారు

- **మహిళ హత్య కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు**
- **మరో ముగ్గురి కోసం ముమ్మర గాలింపు**
- **ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు వెల్లడి**

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మూఢ నమ్మకాల ముసుగులో మహిళను నమ్మించి, ఆమెతో ఉన్న చనువును ఆసరా చేసుకుని నగలకోసం హత్య గావించినట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు వెల్లడించారు. మదనపల్లె పట్టణం జగన్ కాలనీకి చెందిన పేరం స్వర్ణకుమారి (63) హత్యకు గురైన సంగతి తెల్సిందే. హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వెంకటేష్‌ను బుధవారం తాలూకా పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, సిఐలు కళా వెంకటరమణ, చాంద్ బాష అరెస్టు చూపారు. అరెస్టుకు సంబంధించి ఎస్‌పి మాట్లాడుతూ స్వర్ణకుమారి ఒంటరిగా ఉంటోందని స్థానికంగా ఉన్న వెంకటేష్ పూర్వపు గ్రామస్తుడు కావడంతో ఆమెకు చేదోడు వాదోడుగా ఉంటూ సహాయం చేస్తుండేవాడని పేర్కొన్నారు. సహాయం చేస్తున్నట్లు నటిస్తూనే ఆమె నగలపై కన్నేశాడన్నారు. తన స్నేహితుడు అనిల్, అతని తల్లి రమాదేవి కూడా ఇందులో పాలు పంచుకున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా స్వర్ణకుమారికి ఆరోగ్యం బాగలేకపోవడం, ఆమెకు మూఢ నమ్మకాల పిచ్చి ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న వెంకటేష్, తన స్నేహితుడు ఇంటికి స్వామీజీ వస్తున్నాడని, అతను మంత్రిస్తే నయమైపోతుందని నమ్మబలికి సెప్టెంబరు 28న బైక్‌లో కూర్చోబెట్టుకుని నీరుగట్టువారిపల్లె గజ్జలకుంటలోని అనిల్ ఇంటికి తీసుకెళ్లాడని పేర్కొన్నారు. స్వర్ణకుమారిని పూజలో కూర్చోబెట్టి మత్తు బిల్లలు కలిపిన కొబ్బరినీళ్లు తాపుతారని, ఆమె మత్తులోకి జారుకోవడంతో సుత్తితో ఆమె తలపై కొట్టి హత్య చేసి, నగలను దోచుకుని స్థానికంగా ఉన్న మనప్పురం కంపెనీలో తాకట్టు పెట్టి రూ.4.97 లక్షలు తీసుకున్నారన్నారు. ఆ డబ్బుల్లో వెంకటేష్ తల్లి యల్లమ్మకు రూ.లక్ష ఇచ్చి మిగతా డబ్బును వెంకటేష్, అనిల్, రమాదేవి పంచుకుని మృతదేహాన్ని అయోధ్యనగర్ సమీపంలోని శ్మశానవాటికలో పాతిపెట్టి పరారయ్యారని తెలిపారు. అక్టోబర్ 2న స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్ర తాలూకా స్టేషన్‌లో తల్లి కనబడలేదని ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదైందన్నారు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్య జరిగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. మంగళవారం స్పాట్ పిఎం చేసి హత్యకేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రమేయం ఉన్న అనిల్, రమాదేవి, యల్లమ్మలను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

వెంకటేష్‌ది నేర చరిత్ర : స్వర్ణకుమారి హత్య కేసులో ప్రధాన నిందితుడు వెంకటేష్‌కు నేర చరిత్ర ఉందని ఎస్‌పి తెలిపారు. పీలేరు పిఎస్‌లో ఓ హత్య కేసు, రెండు అక్రమ మద్యం కేసులున్నట్లు తెలిపారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు : గంజాయి నియంత్రణ కు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఉక్కుపాదంతో అణచి వేస్తామన్నారు. అన్నమయ్య జిల్లాలోనే ఎక్కువగా గంజాయి కేసులు నమోదు చేసి నిందితులను డిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి రహిత జిల్లా సాధన కోసం కృషి చేస్తామన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

గుండె జబ్బుల పట్ల నిర్లక్ష్యం వద్దు

- గుండె వైద్య నిపుణులు డాక్టర్ మంజునాథ్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మంజునాథ్‌బాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రాణాంతకమైన గుండె జబ్బుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా ఉండొద్దని, అవగాహన-అప్రమత్తతలతో గుండె జబ్బుల భారీ నుంచి సులభంగా బయటపడొచ్చునని నారాయణ హృదయాలయకు చెందిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ మంజునాథ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పిటిఎం.శివప్రసాద్ తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మనిషి శారీరక శ్రమకు దూరమై, తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనౌతున్నాడని, నిద్రలేమి సమస్య కూడా అధికమైందని అన్నారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో బాస్ సంస్థతో కలిసి ఇప్పటివరకూ 19 ఉచిత గుండె వైద్య శిబిరాలు నిర్వహించామని, ఈ శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి గుండె పరీక్షలు చేయించుకుంటున్నారని అన్నారు. ప్రతి శిబిరంలో 10 నుంచి 15 శాతం మందికి గుండె జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ అవుతోందని చెప్పారు. బాస్ నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాల్లో ఇప్పటివరకూ ఐదువేల మందికి పైగా స్క్రీనింగ్ చేశామని, ఇందులో 700 మందికి గుండె జబ్బులున్నట్లు గుర్తించామని అన్నారు. వీరిలో 526 మందికి కోలార్ లోని నారాయణ హార్ట్ సెంటర్‌లో ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఉచితంగా శస్త్ర చికిత్సలు చేశామని చెప్పారు. గుండె జబ్బులను మూడు రకాలుగా గుర్తించడం జరుగుతుందని అన్నారు. ఇందులో గుండె వాల్వ్ డిసీజ్, రక్తనాలాల్లో సమస్యలు, చిన్న పిల్లలకు గుండెలో రంధ్రాలు వంటివి ఉన్నాయని చెప్పారు. వీటిలో ఒకటి జనటికల్ గా వస్తే, మరో రెండు ఫుడ్ అండ్ లైఫ్ స్టైల్ వల్ల వస్తాయని చెప్పారు. మంచి జీవన విధానం అవలభించడం ద్వారా గుండె జబ్బులు రాకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. స్మోక్, ఆల్కహాల్, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిగా మానేయడం, జింక్ ఫుడ్స్ కు దూరంగా ఉండడం, ఆయిల్, నాన్ వెజ్ తగ్గించడం ద్వారా చెడు కొలస్ట్రాల్ పెరగకుండా కంట్రోల్ చేయవచ్చునని అన్నారు. నడక, వ్యాయామం తదితర శరీరక శ్రమల ద్వారా షుగర్, బిపి కంట్రోల్ చేసుకోవచ్చునన్నారు. గుండె జబ్బులకు శస్త్ర చికిత్స చేయించుకున్న వారు నిర్లక్ష్యం చేయకుండా రివ్యూలకు ఖచ్చితంగా వెళ్లాలని, మందులు వాడకం ఆపకూడదని చెప్పారు. గ్యాస్ట్రిక్, హార్ట్ పెయిన్ ఒకేలా ఉంటాయని, అలాంటి పెయిన్ వచ్చినప్పుడు ఖచ్చితంగా గుండె వైద్య నిపుణుల వద్దకు వెళ్లాలని చెప్పారు. 35 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరూ ఏడాదికి ఒక్కసారైనా ఇసిజి, 2డి ఎకో, కొలస్ట్రాల్, బిపి,షుగర్ తదితర గుండె సంబంధిత పరీక్షలు చేయించుకుని గుండె పనితీరును తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో బాస్ నేత పిటిఎం శివప్రసాద్ తోపాటు నారా యణ హృదయాలయ వైద్య శిబిరాల ఇన్‌ఛార్జి నరేష్, ఎకోటెక్నిషన్ మనోజ్ తోపాటు బాస్ ప్రతి నిధులు సొన్నికంటి రెడ్డెప్ప, బురుజు రెడ్డిప్రసాద్, తలారి కృష్ణ, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

గర్భిణులకు బ్రెడ్డు, పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

గర్భస్థ శిశువు సంరక్షణ బాధ్యత తల్లికే ఉంటుంది

ప్రజాశక్తి-పీలేరు

గర్భస్థ శిశువు సంరక్షణ బాధ్యత తల్లికే ఉంటుందని, ప్రతి గర్భిణీ ప్రమాదకర సూచనలపై అవగాహన కలిగి మేలైన ఆరోగ్య పరీక్షలతో తల్లి, బిడ్డ సంక్షేమానికి సహకరించాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తలుపుల పిహెచ్‌సిలో గర్భిణులకు ఆరోగ్య సేవలు అందించారు. ప్రతి గర్భిణికి, ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ ఆరోగ్య సేవల ఆవసారాన్ని వివరించి వారికి రక్త, హిమోగ్లోబిన్, ఆల్బిమిన్, అధిక రక్త పోటు, మధుమేహం మొదలగు ఆరోగ్య సమస్యలు చేయించారు. బరువు చూసి బిడ్డ పెరుగుదల అంచనా వేసి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. మాంసకృతులు, ఆకుకూరలు, క్యాల్షియం, విటమిన్లు, కొవ్వు పదార్థాలు తీసుకోవాలని, కడుపునొప్పి, ఆయాసం, నీరసం, కాళ్లవాపు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నట్లైతే ప్రమాదకరంగా భావించి తక్షణమే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లి ఉచిత చికిత్స, సలహాల పొందాలని అన్నారు. గర్భిణీగా ఉన్నప్పటినుండే శిశువుకు రక్షణ అందించడం తల్లిగా తాము పూర్తి అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వివరించారు. లక్ష్మీ ప్రసన్న సహకారంతో 22 మంది గర్భిణులకు బ్రెడ్డు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, ఎఎన్ఎం నాగవేణి, సిహెచ్ఒ కుముద, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు డిఎస్‌సి శిక్షణ

ప్రజాశక్తి - రాయచోటి

సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 5050 ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రెసిడెన్సియల్ విధానంలో డిఎస్‌సి శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించిందని జిల్లా ఎస్‌సి వెల్ఫేర్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణ సంస్థలలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. Empanelment కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం గత రెండు డిఎస్‌సి రిక్రూట్మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలని, గత డిఎస్‌సి రిక్రూట్మెంట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొందాలని చెప్పారు. మూడేళ్ల ల సరాసరి టర్నోవర్ కనీసం రూ. 40 లక్షలు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'బహుజన బాంధవుడు కాన్షీరామ్'

కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పీలేరు:

బహుజనులకు రాజ్యాధికారానికి దగ్గర చేసిన వారు కాన్షీరామ్ అని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు అన్నారు. కాన్సీరామ్ 18వ వర్ధంతిని బాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాన్షీరామ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా బహుజనులను అణిచివేస్తున్న కుల వివక్షను ఎదిరించి బహుజన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించిన మహానేత బహుజన రాజకీయ వ్యూహకర్త కాన్సీరామ్ అని కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు గన్న బహుజన రాజ్యం కోసం తుది శ్వాస వరకు పోరాడిన మహోన్నత ఉద్యమ శిఖరం ఆయన అని కొనియాడారు. 1934 మార్చి 15వ తేదీన పంజాబ్ రాష్ట్రం, రోపార్ జిల్లా, కావాస్ పూర్ గ్రామంలో హరి సింగ్, బీసన్ సింగ్ కౌర్ దంపతులకు ఆయన జన్మించారని, ఉన్నత విద్యాభ్యాసం చేసిన కాన్సీరామ్ రక్షణ శాఖలో సైంటిస్ట్‌గా పనిచేస్తూ అంబేద్కర్ రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని చదివి, దాని ప్రభావంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడని అదే విధంగా వివాహం కూడా చేసుకోకుండా అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం పోరాడిన గొప్ప మహనీయుడని గుర్తు చేశారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు దళిత మహిళ మాయావతిని నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేశారని తెలిపారు. కార్యక్రమంలో బాస్ నాయకులు యర్రబల్లి మల్లికార్జున, పల్లెపోగు హరినాధ, ముల్లంగి గురవయ్య, నాగేశ్వరరావు, సతీష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన

- జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శైలజ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శైలజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాలలో క్షయ, లెప్రసి రోగులకు మెరుగైన సేవలు అందిచడంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు కీలక పాత్ర వహించాలని అన్నమయ్య జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శైలజ తెలిపారు. బుధవారం మదనపల్లి త్యాగరాజువీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక అరోగ్య కేంద్రాల మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ, మదనపల్లి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు, మదనపల్లి టిబి విభాగపు అధికారి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ క్షయ, లెప్రసి వ్యాధిగ్రస్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, సకాలంలో మందులు మింగేలాగున ప్రతి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు. మందులు ఎప్పుడు వాడాలి.. ఎలా వాడాలి.. అనే విషయాలు పేషంట్‌లకు తరచుగా తెలియచేస్తూ వారి క్లోజ్ కాంటాక్ట్‌లను, హౌస్ హోల్డ్ కాంటాక్ట్ లను గుర్తించి, టిబి లక్షణాలున్నచో గళ్ళ పరీక్ష కొరకు రెఫెర్ చేసి, వారి వివరాలను రెఫరెల్ రిజిస్టర్‌లలో నమోదు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు నిక్షయ్ యాప్ నందు 1000 మంది జనాభాలో ప్రతినెల మూడు శాతం తగ్గకుండా ఫీల్డ్ లెవెల్‌లో క్షయ అనుమానితులను గుర్తించి వారి గళ్ళ సేకరించి సెంటర్‌ల వారిగా ఐడిలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహిత్ గౌడ్, టిబి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చెన్నారెడ్డి, టిబి యూనిట్ సిబ్బంది ప్రభాకర్, దయాలన్, వనజ కుమారి, సుశీల, లెప్రసి అధికారులు వేణుగోపాల్, శ్రీనివాసులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యేలు భరోసానివ్వాలి

- టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎమ్మెల్యే ఆదేశాలను నియోజకవర్గంలో అధికారులు పాటించాలని టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు ఏవైనా అవసరాల కోసం అధికారులను సంప్రదిస్తే పనులు జరగడం లేదని, ఎమ్మెల్యే సిఫారసు చేయవలసి వస్తోందన్నారు. అనుకూలమైన మంచి అధికారులను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్ని సందర్భాలలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించినప్పటికీ ఉన్నతాధికారులు వాటిని పాటించలేదన్నారు. నిమ్మనపల్లి డిటిని బదిలీ చేయగా, తిరిగి అయనను నియమించాలని కోరగా, ఎమ్మెల్యే స్పందించారని అయితే సబ్ కలెక్టర్ జాప్యం చేయడం జరిగిందన్నారు. కార్యకర్తల ప్రతి చిన్న సమస్యకు అటు ఎమ్మెల్యే, ఇటు ముఖ్య నాయకులు ప్రతిసారి స్పందించాల్సి రావడం ఇబ్బందికరంగా మారిందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు పూర్తయిన టిడిపి కార్యకర్తలు ఎమ్మెల్యేని స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు సమస్యలతో రావడం, ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉండడంతో ఈ సమస్య తలెత్తుంతోందన్నారు. అటు నాయకులు, ఇటు కార్యకర్తలలో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే సహా కార్యకర్తల సమస్యలను పరిష్కరించడానికి కొంత సమయం కేటాయించాలని అభిప్రాయపడ్డారు. అటు ప్రజా సమస్యలకు ఇటు పార్టీ నాయకుల, కార్యకర్తలకు ఎమ్మెల్యే సమన్యాయం చేయాలన్నారు. పరిపాలనలో టిడిపి కార్యకర్తలు భాగస్వాములు కావాలని కోరుకుంటున్నారని, ఇది జరగాలంటే నియోజకవర్గంలోని అన్ని శాఖలలో అనుకూలమైన అధికారులను నియమిం చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా కార్యకర్తలకు భరోసాని వ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు మహిళ కార్యదర్శి విజయమ్మ పాల్గొన్నారు.

దుద్యాలలో తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

మండలంలోని దుద్యాల గ్రామం కొత్తపురమ్మ గుడి దగ్గర బుధవారం తాగునీటి బోరును రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరులు లక్ష్మి ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. కొత్తపురమ్మ గుడి దగ్గర ప్రజల సౌకర్యార్థం బోరు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల కోరిక మేరకు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రారంభించి తాగునీటి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న లక్ష్మి ప్రసాద్‌రెడ్డి

మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-కలకడ

గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎర్రకోట పల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎం.వి.కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉప కేంద్రాల వారీగా 108 వాహనంలో గర్భిణులను తీసుక వచ్చి బిపి, షుగర్, హిమగ్లోబిన్, రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కాన్పుకు కష్టతరమైన గర్భిణులను ఉన్నతమైన ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు చెప్పారు. రక్తహీనత తక్కువ ఉన్నవారికి ఐరన్, సుక్రోజ్ ఇంజక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ జి.జయరామయ్య, స్టాఫ్ నర్స్ జై. భారతమ్మ, పిహెచ్‌ఎన్ సుబ్బర త్నమ్మ, హెల్త్ సూపర్వైజర్లు ఎం. వెంకటేశ్వరరావు, బి.రెడ్డమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్ అహ్మద్, ఫార్మసిస్ట్ షేక్ షరీఫ్ బాషా పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నిరుపేదలందరికీ నివాస స్థలాలు మంజూరు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రామాంజనేయులు కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలైనా నేటికీ ఇల్లు ఇళ్ల స్థలాలు లేని నిరుపేద దళిత బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎంతోమంది కటిక పేదరికంతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభు త్వంలో ఇల్లు కాదు ఊర్లు కట్టిస్తున్నామని నిర్లక్ష్యం వహించారని అన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అర్హులైన పేదలకు నివాస స్థలాలు ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, సుబ్బమ్మ , రమణమ్మ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలికిరి తపాలాశాఖ మేనేజర్ టి.సుజిత తెలిపారు. గురువారం తపాలా కార్యాలయంలో ఆధార్ అప్‌డేట్, పేర్లు మార్పులు, చిరునామా మార్పులు, వేలు ముద్రలు ఆధార్‌కు సంబంధించిన అన్ని మార్పులు చేర్పులు జరపడానికి ఈ క్యాంపును నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్

'ఆదిత్య'లో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది నూతన విద్యార్థులకు గొప్పగా స్వాగతం పలికేందుకు ఫ్రెషర్స్‌డేను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదనపల్లి పట్టణానికి చెందిన ప్రకృతి వనం వ్యవస్థాపకులు ప్రసాద్ హాజరవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత సాయికి చేరుకొని నలుగురికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో మదనపల్లి వెల్ఫేర్ సంస్థ గిరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వృత్తి శిక్షణ కోర్సుతో ఉపాధి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని బోయనపల్లెలో గల పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత వృత్తి శిక్షణ కోర్సులు నేర్పించడం జరుగుతుందని, ఆసక్తి గలవారు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ కాలేజ్ భారత్ ఎడ్యుకేషనల్ సొసైటి రాజంపేట ఇన్‌చార్జ్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత్ ఎడ్యుకేషనల్ సొసైటీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ శిక్షణ అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కోర్సులు మూడు నెలల కాలపరిమితి ఉంటుందని, అలాగే విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పించబడునని పేర్కొన్నారు. తమ కళాశాలలో మొబైల్ అసెంబ్లీ సూపర్‌వైజర్, పేషంట్ రిలేషన్, సర్వీస్ ఇంజనీర్, సోలార్ ఫొటోవాలెంటిక్ కోర్సులను నేర్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు. కావున నిరుద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8919238902, 8074510187 నంబర్లను చరవాణి ద్వారా సంప్రదించాలని తెలిపారు.

'పల్లెకు పండుగ'ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-పీలేరు

ఈనెల 14 నుంచి 21వ తేదీవరకు పీలేరు మండలంలో నిర్వహించనున్న "పల్లెకు పండుగ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈఈ మధుసూదన్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బంది. ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో మండలానికి 24 సీసీ రోడ్ల పనులకోసం రూ.85 లక్షలు నిధులు మంజూరయ్యాయని అన్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఆయా గ్రామాల్లో భూమి పూజ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఈ ఎం. రామకృష్ణ నాయక్, ఇంజనీరింగ్ సిబ్బందిపాల్గొన్నారు.

IN THE COURT OF THE Prl. JUNIOR CIVIL JUDGE, MADANAPALLE
O.S.No. 983/2021
D.Venkata Ramana Reddy. ...Plaintiff
Vs
K.Amarnath. ...Defendant
SUMMONS TO DEFENDANT
K.Amarnath, S/o Late, K.Siddappa, D.No.III-146-3-02, Sapthagiri Nagar, Madanapalle.
పై కేసులో కోర్టు నుండి మీకు సమన్లు జారీ అయినందున పేపర్ ప్రకటన ద్వారా 16.10.2024 నాడు ఉదయం గం.10.30 లకు నీ హాజరు నిమిత్తము ఉన్నది. నీవు హాజరు కానిచో నీ పరోక్షమున తీర్మానించబడును.
//By Order of the Court//
A.MOHAN KUMAR,
B.A.,L.B.L.,
Advocate,
MADANAPALLE.

రాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ డివిజన్, నందలూరు
O.S.No. 62/2022
ముమ్మడిశెట్టి క్రిష్ణయ్య @ ఉమ్మడిశెట్టి క్రిష్ణయ్య, తండ్రి వెంకటయ్య, 52సం॥, వ్యవసాయం, పాటూరు గ్రా॥, నందలూరు మం॥, అన్నమయ్య జిల్లా. ...వాది
Vs
పులి నాగరాజ్, భర్త తిరుపాలు, 47సం॥లు, పొగాకు వీధి, నాగిరెడ్డిపల్లె గ్రా॥, నందలూరు మం॥, అన్నమయ్య జిల్లా. ...4వ ప్రతివాది
పై కోర్టులో పై కేసులో మీ తండ్రి లేట్ ఎద్దుల గజేంద్రయ్య పై ప్రోనోట్ బాకీ రూ.2,02,820/- వాది పై దావా వేసియున్నారు. మీరు వారసులు గనుక, బాకీ తీర్చాల్సిన బాధ్యత మీ పై వున్నది. కావున మీరు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని 20.11.2024వ తేదీన పై కోర్టులో ఉ.10.30 గం॥లకు హాజరై ఆక్షేపణలు తెలుపకోరడమైనది. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.
//By Order of the Court//
ఓ.వి.క్రిష్ణారెడ్డి, ఎమ్.ఎ.,ఎల్.ఎల్.బి.,
వాదితరం న్యాయవాది

నాటి విశ్రాంతి భవనం పునర్నిర్మాణం జరిగేనా?

- గత ప్రభుత్వంలో కూల్చివేసిన పంచాయతీ రాజ్ అతిథి గృహం
- నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా పిఆర్ బంగ్లా ఖాళీ స్థలం

పీలేరులోని నాటి పంచాయతీ రాజ్ అతిథి గృహం

ప్రజాశక్తి-పీలేరు

వ్యాపారం పేరుతో మన దేశాన్ని కొల్లగొట్టడానికి వచ్చిన తెల్లవారు తమ అవసరాలు, అను కూలం కోసం ఎన్నో భవనాలు, భవంతులు, రహదారులు, రైలు మార్గాలు, వంతెనలు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానాలు నిర్మించారు. కాలానుక్రమంలో చోటు చేసుకువస్తున్న పరిస్థి తుల ఫలితంగా కొన్ని చోట్ల సంబంధిత శాఖాధికారులు వాటికి తాత్కాలిక మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తూ అతిథుల అవసరాలు తీరుస్తున్నారు. మరికొన్నిచోట్ల వాటి ప్రమాద స్థితిని గ్రహించి కూల్చేస్తూ వస్తున్నారు. నేటి అవసరాలకు తగ్గట్టుగా మన, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నిర్మాణాలు చేపట్టాల్సిన బాధ్యత మన ప్రభు త్వాలకు ఉంది. అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యాలకు నిలువెత్తు సాక్ష్యంగా ఎన్నో పురాతన కట్టడాలు శిథిలమవుతున్నాయి. అలా కనుమరుగౌతున్న పురాతన భవనాల్లో పీలేరు పంచాయితీ రాజ్ విశ్రాంతి భవనం కూడా ఒకటి. ఆంగ్లేయుల పాలనలో పీలేరు పట్టణ శివారు లోని రైల్వే స్టేషన్ సమీపంలో ఓ అతిథి గృహం నిర్మించబడింది. బ్రిటీషు వారు తమ రైలు ప్రయాణానికి ముందు, ఆతరువాత అందులో వారు సేదదీరేవారని పాత తరం పెద్దలు చెబుతుండే వారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఆ విశ్రాంతి భవనం వారి గుర్తుగా మిగిలిందని కూడా చెబుతుంటారు. కాలక్రమేణా దాని నిర్వహణా బాధ్యతలు జిల్లా పరిషత్ తీసుకుంది. పీలేరుకు వచ్చే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతి నిధులు, ప్రము ఖులకు ఇక్కడే విడది ఏర్పాటు చేసేవారు. పీలేరు నియో జకవర్గం ఎమ్మెల్యే, రాయలసీమ అభివృద్ధి మండలి ఛైర్మెన్‌గా విశిష్ట సేవలందిం చిన దివంగత మొగల్ సైపుల్లా బేగ్ తన పదవీకాలంలో ఈ బంగ్లా అభివృద్ధికి కృషి చేశారని తెలుస్తోంది. ఆ తరువాత వచ్చిన ప్రజా ప్రతినిధులు కూడా ఎప్పటికప్పుడు బంగ్లా అభివృద్ధికి ప్రయ త్నాలు చేశారన్నది వాస్తవం. గత పాలకులు లక్షలాది రూపాయలు ఖర్చుచేసి పాత భవనంపై మరో అంతస్తు నిర్మించారు. జిల్లాపరిషత్ కొంత కాలం తర్వాత దీని నిర్వహణ బాధ్యతలు మండల పరిషత్‌కు అప్పగించింది. అతిథిగృహం నిర్వహణకు తగిన నిధులను మండల పరిషత్ సమకూర్చలేక పోతుం డడంతో అది కాస్తా నిరాదరణకు గురైంది. ఈ అతిథిగృహం స్థానిక రైల్వే స్టేషనుకు సమీపంలో పీలేరు– మద నపల్లి జాతియ రహదారి ఎత్తు కన్నా దిగువకు లోతట్టు ప్రాంతంలో ఉంటోంది. వర్షం కురి సిన ప్రతి సారీ నీరు బంగ్లా ప్రాంగణంలోకి చొరబ డుతూ అతిథి గృహంలోకి చేరేవి. దానికి తోడు బంగ్లా భూమట్టంకన్నా ఎత్తుగా ప్రాంగణంలో సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మిం చడంతో వర్షానికి కొట్టుకు వచ్చే మట్టి, ఇసుక బంగ్లా గ్రౌండ్ ఫ్లోర్‌లోకి చొరబడుతూ వచ్చేవి. ఆ వ్యర్థాలను తొలగించి, విశ్రాంతి భవనం అడుగు భాగం ఎత్తు పెంచి, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాల్సిన అప్పటి మండల పరిషత్ అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేయడానికి బదులు ఆ బంగ్లానే నిరుపయోగమని తేల్చేస్తూ జిల్లా అధికారులకు నివేదికలు పంపి చేతులు దులుపుకున్నారు. ప్రశాంత వాతవరణంలో చరిత్ర కలిగిన విశ్రాంతి భవనం ఆధునీకరించే ప్రయత్నం ఎవరూ చేయక పోవడంతో శిథిలావస్తకు చేరింది. గత వైసిపి ప్రభుత్వంలో ఓ కాంట్రాక్టరు దాని పునర్నిర్మాణం పనులకు అనుమ తులు తీసుకు వస్తానంటూ ఉన్న అతిథి గృహాన్ని నేలమట్టం చేశాడు. అతిథిగృహం తిరిగి నిర్మించక పోవ డంతో ఆ స్థలం కాస్తా బీడుగా మారింది. ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో నైనా ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చొరవ చూపి పాత విశ్రాంతి భవనం స్థానంలో కొత్త విశ్రాంతి భవనం నిర్మిచడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు పేర్కొన్నారు.

రూ.30 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రం

- టిడిపి ఇన్‌ఛార్జి 'ముక్కా', ఎమ్మెల్యే శ్రీధర్

ఆరోగ్య కేంద్రానికి భూమిపూజ చేస్తున్న రూపానందరెడ్డి, శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని మైసూరువారిపల్లె గ్రామంలో 30 లక్షల రూపాయల వ్యయంతో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవశ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి వారు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని అన్నారు. మైసూరివారిపల్లి గ్రామసభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సిఎం,డిప్యూటీ సిఎం పనిచేస్తున్నారని తెలిపారు. మైసూరువారిపల్లి గ్రామంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకుంటూ గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు కారుమంచి నారాయణ రూ.30లక్షలు విలువ చేసే పది సెంట్ల భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చి మాట నిలుపుకున్నారని అభినందించారు. అనంతరం భూ దాత నారాయణ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ బాల నరసింహులు, కూటమి నాయకులు కట్టా గుండయ్య నాయుడు, తాతంశెట్టి నాగేంద్ర, సర్పంచ్ సంయుక్త, కొమ్మ శివ, లారీ సుబ్బరాయుడు, నీలకంఠయ్య, తిమ్మిశెట్టి మణి, నాగరాజ, హేమరాజు పాల్గొన్నారు.

వారపు సంతలో మెరుగైన సౌకర్యాలు : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల కేంద్రమైన నిమ్మనపల్లి వారపు సంతలో వ్యాపారస్తుల, ప్రజల సౌకర్యార్థం మెరుగైన వసతులను ఏర్పాటు చేసినట్లు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. వారపు సంతల్లో ఇటీవల సుమారు రూ.15 లక్షల నాబార్డ్ నిధులతో, రూ.1.5 లక్షల గ్రామపంచాయతీ నిధులతో వ్యాపారస్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు, సిమెంటు రోడ్లు, మరుగుదొడ్లు, వారపుసంతల్లో కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, కూటమి ప్రభుత్వ నాయకులు కలిసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మదనపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలిపారు. మదనపల్లెలో జిల్లాగా ప్రకటించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ సిసిరోడ్లను, మురికి నీటి కాలువలను నిర్మిస్తామ న్నారు. నిమ్మనపల్లె మండలంలో టిటిడికి చెందిన కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తు న్నామని తెలిపారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయటానికి ప్రభు త్వాన్ని ఇదివరకే సంప్రదించినట్లు తెలిపారు. అక్టోబర్ 15,16,17 తేదీలలో నిమ్మనపల్లి లోని ప్రతి గ్రామాలలో పర్యటించి ప్రజల సమ స్యలను నేరుగా తెలుసుకుంటానని తెలిపారు. వైసిపి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదు ర్కొన్నారని అన్నారు. అభివృద్ధిని గాలికి వదిలేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి ప్రజలు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. నిమ్మనపల్లి వారపు సంతలో మెరుగైన వస్తువులు ఏర్పాటు చేయడానికి నిధులను సమకూర్చి సహకరించిన నాబార్డ్ అధికారులకు, వారపు సంత అభివృద్ధికి కృషి చేసిన గ్రామీణ అభివృద్ధి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప మాట్లాడుతూ నిమ్మనపల్లె పంచాయతీని మండలంలో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మంది ఇస్తున్న ప్రతి అవకాశాన్ని అభివృద్ధి దిశగా మలుచుకొని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు పంచాయతీలో కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

సరస్వతీదేవి అలంకారంలో రెడ్డెమ్మ

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని శ్రీరెడ్డమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు శ్రీ అమ్మవారు శ్రీమహా సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో శ్రీ అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంక రించారు. తదుపరి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈఊరి శేఖర్ ఉభయ దారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎనిమిదివ రోజు అమ్మవారు శ్రీదుర్గా దేవిగా దర్శనమిస్తారని ఆలయ ఇఒ మంజుల తెలిపారు.**రాజంపేట అర్బన్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాజంపేట పట్టణ శివారు మన్నూరులో వెలసిన ఉదయగిరి ఎల్లమ్మతల్లి కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొర్రపాటి రవి మోహన్ స్వామి, కొర్రపాటి నవీన్ కుమార్ స్వామిలు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చనలు గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఉభయదారులైన మన్నూరు గ్రామ వాస్తవ్యులు విజయ్ ప్రతాపరెడ్డి, అనురాధ దంపతులు అమ్మవారికి ప్రసాదాలు పంపిణీ చేశారు.**నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 7వ రోజు బుధవారం సరస్వతి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు.సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరిదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం బింద సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యద´ర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగసురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచికంటి నారాయణ, వల్లంకొండు చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువ జన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్, కుమార్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

పీలేరు సర్కిల్ పరిధిలో నోటిఫికేషన్ జారీ చేసిన మొత్తం 9 మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు ను ఈ నెల 11 వరకు పెంచినట్లు పీలేరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ వి.సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు మద్యం షాపులకు దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు చివరగా గడువు పొడిగించినట్లు చెప్పారు. లాటరీ నిర్వహించు తేదీని కూడా ఈ నెల 14 వ తేదీకి మార్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అందరూ గమనించి, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు 14 వ తేదీన రాయచోటి– మదనపల్లి మార్గంలోని అజయ్ కన్వెన్షన్ హాల్లో జరిగే లాటరీలో పాల్గొనాలని తెలిపారు. కొత్తగా దరఖాస్తులు చేయదలచుకున్న అభ్యర్థులు ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 7 గంటల లోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా సమర్పించాలని కోరారు. పీలేరు సర్కిల్ పరిధిలోని 9 మద్యం షాపుల కోసం బుధవారానికి మొత్తం 65 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్ల లాటరీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్, అధ్యక్షుడు జి.దాసు కోరారు. ఆ మేరకు వారు బుధవారం సూపరింటెండెంట్ రఫిక్ పాషాకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు ప్రతి నెల కాం ట్రాక్టర్ జీతాలు ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ప్రతి నెల 5లోపు జీతాలు ఇస్తామని చెప్పి కాంట్రాక్టర్ ప్రభుత్వంతో ఒప్పం దం చేసుకున్నారని తెలిపారు. నెలలో కొన్నిరోజుల జీ తాలు పెండింగ్ పెడు తూ మూడు నెలల జీతాలు ఇచ్చి మిగతా జీతాలు బ్యా లెన్స్ పెడుతున్నారన్నారు. వర్కర్లపై దౌర్జన్యం ప్రదర్శి స్తున్న సూపర్‌వైజర్ పీరాపై కఠిన చర్యలు తీసుకొని, వెంటనే విధుల నుండి తొల గిం చాలని డిమాండ్ చేశారు. సమస్యలను 14 రోజుల్లో పరి ష్కరించకపోతే ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు, మున్సి పల్ యూని యన్ నాయకులు శేఖర్, స్వామి, భీమా, పాల్గొన్నారు.

జడ్జిలకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న పసుపులేటి శంకర్

సౌమ్యనాథుడి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి-నందలూరు

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు ఎం.లక్ష్మణ్, ఎ.లక్ష్మీనారాయణ బుధవారం నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం న్యాయమూర్తులకు రాజంపేట స్పెషల్ జ్యూడి షయల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ దేవాలయాల చరిత్ర పుస్తకాలను అందచేసి పట్టు శాలువాలతో సత్కరించారు.దేవాలయ పురోహితులు ఆశీర్వచన అనంతరం న్యాయమూర్తులకు డాక్టర్ శంకర్ దేవాలయ చరిత్ర వివరించారు. వీరి వెంట నందలూరు కోర్టు సూపరిండెండ్ రమేష్, కోర్టు సిబ్బంది టిటిడి ఇన్స్‌పెక్టర్ దిలీప్, నందలూరు ఎఎస్‌ఐ శంకర్నాయక్, వర్మ, సుబ్బారాయుడు, భారత పురావస్తు శాఖ విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు ఉన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

వ్యాపార సముదాయాల ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల సభ్యులచే వ్యాపార సముదాయాల ఏర్పాటుకు కృషి చేయాలని జిల్లా వెలుగు టిడి సత్యనారాయణ కోరారు. బుధవారం శ్రీ శక్తి భవన్‌లో ఎస్‌విఇపి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, బి కొత్తకోట, కురబలకోట, పెద్దతిప్ప సముద్రం, ములకలచెరువు, పెద్దమండ్యం మండలాల ఎపిఎంలు, సిసిలు, సిఆర్‌పిలు,సంఘమిత్రలకు మూడు రోజులపాటు ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. షార్ఫ్ ప్రతినిధులు ఎస్‌విఇపి అమలు, లబ్ధిదారుల ఎంపిక, వ్యాపార అనుకూలతలు తదితర అంశాలపై వివరించారు. తంబళ్లపల్లి నియోజకవర్గాన్ని ఎస్‌విఇపి కార్యక్రమం పై పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు పీడీ తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకునే విధంగా వెలుగు సిబ్బంది కృషి చేయాలని కోరారు.

విష్ణువర్ధన్‌కు 'స్టార్ ఆఫ్ ఆంధ్ర' పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

ట్రోఫీ అందుకుంటున్న విష్ణువర్ధన్

పట్టణంలోని స్థానిక బండ్ల వీధికి చెందిన బి.విష్ణువర్ధన్ బాల్ బ్యాడ్మింటన్‌లో స్టార్ ఆఫ్ ఆంధ్ర పురస్కారం అందుకున్నాడు. పీలేరు సిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విష్ణువర్ధన్ మీడియాతో మాట్లాడుతూ ఈనెల 5, 6,7 తేదీల్లో విశాఖపట్నం, ననపర్తిలో జరిగిన అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున ఆడి బెస్ట్ ప్లేయర్‌గా రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. వచ్చే ఏడాది జనవరిలో జాతీయస్థాయిలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు. తనను ప్రోత్సహించి ఇంతటి స్థాయికి తీసుకొచ్చిన ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ, పీలేరు సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకా రులు అవినాష్ రెడ్డి, రాజేష్‌లకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రముఖులు విష్ణువర్ధన్‌ను అభినందించారు.

క్రైం కార్నర్

అరెస్టయిన నిందితులను చూపుతున్న పోలీసులు

ఇద్దరు గంజాయి నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పుల్లంపేట

గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాజంపేట రూరల్ సిఐ బివి.రమణ, స్థానిక ఎస్‌ఐ మోహన్ కుమార్‌గౌడ్ తెలిపారు. బుధవారం మీడియా సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన లక్ష్మీదేవి, అప్పయ్య రాజుపేట కి చెందిన ఆఫ్రిద్ అనే ఇద్దరు వ్యక్తుల నుంచి ఒక కిలో గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, కాని స్టేబుల్ మనోజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలోని చెంబకూరు రోడ్డు, రెక్కమాను వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. మృతుడు ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాల సేకరణకు విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-గాలివీడు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..చిన్నమండెం మండలం ఎగువగొట్టువీడుకు చెందిన వరుణ్‌కుమార్(25) బైక్‌లో గాలివీడుకు బయలుదేరినట్లు తెలిపారు. మార్గమధ్యలో గోరాన్‌చెరువు, వరిసెలవంకపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ రెండు వాహనాలు ఢీ కొనడంతో వరుణ్‌కు తీవ్రగాయాలు కాగా, ట్రాక్టర్ డ్రైవర్ సోము స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. వరుణ్‌కు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎఎస్‌ఐ ఆంజనేయరెడ్డి తెలిపారు.